ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తిని చాటాలి

● ఎమ్మెల్యేలు శిల్పారవి, ఆర్థర్
● నంద్యాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా భావించి క్రీడా స్ఫూర్తిని చాటాలని, నంద్యాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు.


ఎమ్మెల్యే శిల్పా రవికి మెమెంటో అందజేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆర్థర్, ఎమ్మెల్సీ ఇసాక్

వారు మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి మొత్తం 450 మంది క్రీడాకారులతో పాటు 60 మంది సిబ్బంది పాల్గొన్నారు. కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి, ఎలమంచలి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నాగరాజు, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, అన్సర్, సురేష్‌నాయుడు పాల్గొన్నారు.


గోవిందపల్లెలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

అభివృద్ధే ప్రభుత్వ అజెండా

శిరివెళ్ల: ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధే తమ అజెండా అని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం గోవిందపల్లె, కామినేనిపల్లె, కోటపాడులో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గోవిందపల్లెలో రూ. 50 లక్షల గడప గడపకు మన ప్రభుత్వ నిధులు, ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన 10 సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. రూ. 5.50 కోట్లతో చేపట్టనున్న గోవిందపల్లె- ఇసుకపల్లె బీటీ రోడ్డుకు భూమి పూజ చేశారు. రూ.1.24 కోట్లతో చేపట్టిన వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం కామినేనిపల్లె గ్రామంలో రూ. 31 లక్షలతో వేసిన సిమెంట్ రోడ్లు, చెత్త సంపద కేంద్రం, తాగునీటి పైప్‌లైన్‌ను ప్రారంభించారు. అంతకు ముందు సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి అధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కోటపాడులో రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని టీడీపీ గగ్గోలు పెడుతుందని, క్షేత్రస్థాయిలో తిరిగితేనే కదా అభివృద్ధి ఏంటో తెలుస్తుందన్నారు. అందుకే నాడు - నేడు కార్యక్రమం ద్వారా గతంలో ఉండే పరిస్థితి, తాము మార్చిన స్థితిని ఫొటోలతో సహా ప్రదర్శిస్తున్నామని, ఇంతకంటే మీకు సాక్ష్యం ఏమి కావాలని ప్రశ్నించారు. అసలు మీకు అభివృద్ధికి నిర్వచనం తెలియకపోవడమే అసలు సమస్య అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కేవలం మీరు మాత్రమే బలపడడం అభివృద్ధి అనుకుంటే ఎలా? అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని మీకు తెలియనంత మాత్రాన విమర్శలు, ఆరోపణలు చేస్తే ఎలా అని చురకలు అంటించారు. ప్రతి గ్రామంలో ప్రజల కోరిక మేరకు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. అలాగే టీడీపీ పాలనలో నోచుకోని గ్రామీణ రోడ్లను నేడు ఎంత అభివృద్ధి చేశామో ఒక్కసారి తిరిగి చూడాలని సూచించారు. శిరివెళ్ల మండలంలో టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని జీనేపల్లె, చెన్నూరు గ్రామీణ రోడ్లు, శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాల మధ్య రైతన్నల కోసం తారు రోడ్ల వేశామన్నారు. నాడు మంత్రి హోదాలో ఉండి కూడా పట్టించుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ మండల, జిల్లా అధ్యక్షులు ఇందూరి ప్రతాపరెడ్డి, బీ. అబ్దుల్ సలాం, సొసైటీ చైర్మన్ నర్ల రాజశేఖరెడ్డి, వంకదార సుబ్బసత్యనారాయణ శ్రేష్టి, ఎంపీటీసీ స్వాతి, సర్పంచులు మరియమ్మ, దూదుకుల ఉశేన్‌బీ, మందాల శివారెడ్డి, కందుల ప్రసాదరెడ్డి, అయ్యలూరి సుభహాన్, రఘునాథరెడ్డి, పెద్ది రమణయ్య, మండల మాజీ జెడ్పీటీసీ నజీర్, ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, గ్రామాల నాయకులు సత్తార్ ప్రతాపరెడ్డి, మేర్వ నాగభూషణం రెడ్డి, ఉశేనిరెడ్డి, గుర్వప్ప, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో శనివారం నూతన క్యాలెండర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. నిర్వాహకులు సంఘ శివకుమార్, జయంతి మాట్లాడుతూ కాపు బలిజల ఐకమత్యాన్ని చాటాలని, కులస్తులు రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని కోరారు. నాయకులు సురేష్‌కుమార్, బాలచంద్రుడు, శీను, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు


కంప చెట్లను తొలగిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడులో ముళ్ల కంపలతో దీర్ఘకాలికంగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్తుల సమస్యను శనివారం పరిష్కరించారు. గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి ఎస్సీ, మైనార్టీ కాలనీల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను జేసీబీ సాయంతో తొలగించారు. అనంతరం రోడ్డుపైనున్న గుంతలను పూడ్చించారు. ముళ్ల పొదలు పెరిగిపోవడంతో ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, ప్రస్తుతం వాటిని తొలగించడంతో తమకు అవస్థలు తప్పాయని స్థానికులు పేర్కొన్నారు.

తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం


తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న రాజు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఇండోర్ స్టేడియంలో శనివారం 37వ ఓపెన్ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలో రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే నంద్యాల జిల్లాకు క్రీడల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారన్నారు. క్యాడెట్ విభాగంలో 30 మంది, జూనియర్స్ విభాగంలో 40, సీనియర్స్ విభాగంలో 15 మంది బాలికలు పాల్గొన్నారని చెప్పారు. జిల్లా ట్రెజరర్ బిలాల్‌బాషా ఉన్నారు.

కులగణనకు సహకరించాలి

నంద్యాల(సిటీ): కులగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల అర్బన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అధికారులు సర్వే నిర్వహిస్తారని, ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పది రోజుల పాటు జరిగే సర్వేకు ప్రతి ఒక్కరి కులాన్ని అధికారులు నమోదు చేసుకుంటారని చెప్పారు. అధికారులు సాయంత్రం వేళల్లో నిర్వహించే సర్వేకు ప్రజలు తోడ్పాటునందించాలని కోరారు.

◆ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. పట్టణంలో నిర్వహించే కార్యాక్రమంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించడమే కాకుండా అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో పల్లె టెక్నాలజీ బెంగుళూరు కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ట్రైనింగ్ కం ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. డ్రైవ్ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. 140మంది విద్యార్థులు పరీక్ష రాయగా 80 మంది రెండో రౌండ్‌కు అర్హత సాధించారు. మూడో రౌండ్‌లో 25 మంది యువతీ యువకులు అర్హత సాధించినట్లు చెప్పారు. ఎంపికైన వారికి ఉచితంగా ట్రైనింగ్‌తో పాటు ప్రతిభ ఆధారంగా వివిధ హోదాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, పల్లె టెక్నాలజీ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీవిద్య తెలిపారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి


నెహ్రూనగర్‌లోని పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

గోస్పాడు: విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని మహానంది వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ సరోజినీదేవి, పర్యవేక్షక అధ్యాపకులు డాక్టర్ నారాయణరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, రామాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం, పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుభ్రం చేశారు. సంతోష్‌కుమార్ నాయక్, గీతాశిరీష, జయసింహారెడ్డి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు బస్టాండు సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ రమణయ్య శనివారం తెలిపారు.

విద్యార్థుల వద్దకే ప్రపంచ విజ్ఞానం

నంద్యాల: నాడు-నేడుతో సర్కారు పాఠశాలల రూపు రేఖలు మార్చిన ప్రభుత్వం ప్రస్తుతం బైజూస్ ట్యాబ్స్, ఐఎఫ్‌పీల ద్వారా ప్రపంచ విజ్ఞానాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల చెంతకు తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్ ప్రభుత్వ స్కూళ్ల కార్యక్రమంపై ఎంఈఓలు, ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్ సేవలను ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 3 ఇంజినీరింగ్ కాలేజీల నుంచి 75 మంది విద్యార్థులను 225 పాఠశాలలకు మ్యాప్ చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. ఒక్కో విద్యార్థికి మూడు పాఠశాలలు కేటాయించి, అక్కడ ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలపై, అన్నిరకాల సాంకేతిక అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వం నెలకు రూ.1200 స్టైఫండ్ ఇస్తుందన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం మాట్లాడుతూ కార్యక్రమం గురించి వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

డీఈఓ సుధాకరరెడ్డి, ఉప విద్యాధికారి బేగ్ , అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలివ్వాలి

నంద్యాల(సెంట్రల్): బ్యాంకులు రైతులకు విరివిగా రుణాలివ్వాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరం పలు పంటల రుణ పరిమితికి సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించే అంశంపై కలెక్టర్ చాంబర్‌లో జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, నంద్యాల ఎల్‌డీఎం రవీందర్ కుమార్, డీసీసీబీ నంద్యాల జోనల్ మేనేజర్ శివలీల, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల బహిరంగ వేలం

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు మున్సిపల్ దుకాణాలకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో జరిగిన వేలాల్లో సాల్వెన్సీ, గుడ్‌విల్, డిపాజిట్ చెల్లించిన వ్యాపారులు మాత్రమే వేలంలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్‌ఓ వెంకటకృష్ణ, ఆర్‌ఐ గులాం హుసేన్ పాల్గొన్నారు.

దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): దళిత కుటుంబాల సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వారికే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మాలమహానాడు రాయలసీమ నాయకుడు కడియం సాంబశివుడు, దళిత మహిళా సేన అధ్యక్షురాలు రోజక్క కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ 1982లో ప్రభుత్వం దళితులకు స్థలాలు కేటాయించిందని, 2019లో మాత్రం స్థలాలు ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. బండి చంద్రపాల్, శేఖర్, పరిమళరాణి, మరియమ్మ, సారమ్మ, దానమ్మ పాల్గొన్నారు.

నంద్యాలలో అభివృద్ధి కనిపించదా?



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(సిటీ): పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పచ్చ పార్టీ నాయకులు, పచ్చ పత్రికలకు కనిపించదా అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం స్థానిక 2వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ప్రారంభించారు. అలాగే 2, 3, 5 వార్డుల పరిధిలోని షాలి మసీదు నుంచి నడిగడ్డ వరకు రూ.2కోట్లతో నిర్మిస్తున్న పనులకు అదనంగా రూ.40లక్షలు మంజూరు చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వల్ప కాలంలో పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపించామన్నారు. గతంలో 14 సంవత్సరాలు అధికారంలో చేసిన అభివృద్ధి కంటే అధికంగా చేసి చూపిస్తున్నామని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాల ప్రజలు నమ్మరాదని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగి శెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు సాదిక్, సమ్మద్, కలాం, ఆరిఫ్ నాయక్, తబ్రేజ్, కృష్ణమోహన్, కో ఆప్షన్ సభ్యులు సుబ్రహ్మణ్యం, సలాముల్లా, నాయకులు గోరె, ముర్తుజా, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, దస్తగిరి, గోపాల్, జాకీర్, ఎర్రన్న పాల్గొన్నారు.

గో సంరక్షణతో సకల సంపదలు

చాగలమర్రి: గో జాతి సంరక్షణతోనే సకల సంపదలు చేకూరి, నేల సారవంతమై, ప్రకృతి పులకించి, పంటలు సమృద్ధిగా పండుతాయని ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మద్దూరు గ్రామంలోని స్వయంభుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు గోపూజ, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎం.రమణమ్మ, దస్తగిరి, ఆలయ అర్చకులు మామిడి కిషోర్ శర్మ, సాయి శ్రవణ్ శర్మ, రమణయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ ఏర్పాటు

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ నంద్యాల పట్టణ కమిటీని ఏర్పాటు చేశామని జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి, అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో పట్టణ కమిటీని ఏర్పాటు చేసి మాట్లాడుతూ కమిటీలో ఉపేంద్రనాథ రెడ్డి, కృష్ణమూర్తి, సాయితో పాటు 20మందిని ఎన్నుకున్నామన్నారు. అధ్యక్షుడు కొత్తి చంద్రశేఖర్, మేడా మురళీధర్, శ్రీధర్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు జట్ల ఎంపిక

శిరివెళ్ల: గోవిందపల్లె మైదానంలో శనివారం ఆడుదాం ఆంధ్ర సెమీ, ఫైనల్ పోటీలు జరిగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో గోవిందపల్లె, యర్రగుంట్ల జట్లు సత్తాచాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. గెలుపొందిన జట్లను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అభినందించారు. ఖోఖో, క్రికెట్ ఫైనల్‌లో గోవిందపల్లె 2 జట్టు విజయం సాధించింది. కబడ్డీలో గోవిందపల్లె 1, బాల్ బ్యాడ్మింటన్‌లో యర్రగుంట్ల 1, వాలీబాల్‌లో యర్రగుంట్ల 2 జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. జట్ల సభ్యులను జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా, మండల అధ్యక్షులు బీ.అబ్దుల్ సలాం, ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచులు నక్కా మరియమ్మ, అయ్యలూరి సుభహాన్, మండల మాజీ ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, ఉప సర్పంచులు ఇందూరి శేషారెడ్డి, సత్తార్ ప్రతాపరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అభినందించారు.


క్రికెట్‌లో విజయం సాధించిన యర్రగుంట్ల-2 జట్టును అభినందిస్తున్న ఎమ్మెల్యే గంగుల

గోస్పాడు: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా క్రికెట్ పోటీల్లో యాళ్లూరు జట్టు విజయ సాధించిందని ఎంపీడీఓ నాగఅనసూయ తెలిపారు. శనివారం సాంబవరం, యాళ్లూరు-1 జట్లు తలపడగా పది ఓవర్లలో యాళ్లూరు జట్టు 98 పరుగులు చేయగా సాంబవరం జట్టు 53 పరుగులు చేయగా యాళ్లూరు జట్టు విజయం సాధించింది. కృష్ణారెడ్డి అత్యధికంగా 40 పరుగులు సాధించాడు. నేటితో మండల స్థాయి పోటీలు ముగిశాయి. పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు ఉన్నారు.


బాల్‌బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచిన యర్రగుంట్ల-1 జట్టు


వాలీబాల్‌లో నియోజకవర్గ పోటీలకు ఎంపికైన యర్రగుంట్ల-2 జట్టు


గెలుపొందిన యాళ్లూరు జట్టు

ఆలయాల్లో కోయిల్ ఆల్వార్ తిరుమంజన సేవ


ఆలయాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కాళికాంబ చంద్రశేఖర దేవస్థానం, గోపాల్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం కోయిల్ ఆల్వార్ తిరుమంజన సేవ కార్యక్రమాన్ని మన వూరు, మనగుడి, మన బాధ్యత సభ్యులు నిర్వహించారు. ఆలయాల్లోని విగ్రహాలు, పరిసరాలు, ఉత్సవ మూర్తులను పరిశుభ్రంగా ఉంచారు. సన్నల సాయిరాంరెడ్డి, గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన జరిగే అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయాల్లో ఈ సేవ కార్యక్రమం భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించామని చెప్పారు. వైద్యులు సహదేవుడు, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం , విజయ్‌కుమార్, శ్యాంసుందర్‌గుప్త పాల్గొన్నారు.

వేగంగా కులగణన సర్వే

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో కుల గణన సర్వే వేగంగా సాగుతోంది. ఆయా గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిసేకరిస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో సర్వే సాగుతుండగా ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు.


ప్రణాళికలు సిద్ధం చేయండి..

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి,ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2024 ఆర్థిక సంవత్సరానికి ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు రూపొందించుకొని, అవసరమైన వనరులను సమకూర్చుకోవాలని చెప్పారు.

ఈ నెల 27న రాయలసీమ నిజదర్శన దీక్ష

నంద్యాల(సెంట్రల్): సీమ సాగునీటి సమస్యలకు పరిష్కార మార్గాలు ఆలోచించకుండా ప్రజల్ని మభ్యపెడుతున్న రాజకీయ పార్టీల చర్యలను సమాజం ముందుంచే లక్ష్యంతో ఈనెల 27వ తేదీన నంద్యాలలో రాయలసీమ నిజదర్శన దీక్షను చేపట్టామని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్.రెడ్డి, ఉప్పలపాటి బాలీశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని సమితి కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. వైఎస్ రెడ్డి మాట్లాడుతూ సీమ సాగునీటి హక్కుల్ని సాధించుకోలేకపోవడానికి కారణాలు, విభజన చట్టం అమలుకు చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై విశ్లేషించి ప్రజల్ని చైతన్యవంతులను చేసేలా సమావేశం ఉంటుందన్నారు. నాయకులు ఆంధ్రబ్యాంక్ విశ్రాంత ఏజీఎం శివనాగిరెడ్డి, మహమ్మద్ పర్వేజ్, భాస్కర్ రెడ్డి, కొమ్మా శ్రీహరి, శివరామిరెడ్డి, పట్నం రాముడు, కృష్ణమోహన్‌రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలుద్దాం


ఉయ్యాలవాడలో పథకాల లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ : అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందిస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలువాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో మూడవ రోజు ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, సర్పంచ్ మేకల ఓబులేసు, ఎంపీటీసీ గగ్గెర వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు ఖాతా దస్తగిరిరెడ్డి, ముసాని శివానంద రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సహాయాన్ని బుక్‌లెట్ అందించి వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వలంటీర్ల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీడీపీలో పథకాల అమలు, అభివృద్ధి, పథకాల లబ్ధిని జగనన్న పాలనతో పోల్చి వివరించారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.35,11,22,315 ఖర్చు చేయగా, ఇందులో 6903 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా రూ.17,02,30,810, పరోక్షంగా 1,983 మందికి రూ.4,38,95,061 లబ్ధి చేకూరిందని వివరించారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల క్రిష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు పల్లె గురుప్రసాద్‌రెడ్డి, రామమద్దిలేటిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, నాయకులు కూలూరు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో చాగలమర్రి మండలం

చాగలమర్రి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరయ్యాయని ఎంపీపీ వీరభద్రుడు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పంచాయితీ రాజ్ ఏఈ కొండారెడ్డి మాట్లాడుతూ మండలానికి 17 సచివాలయ భవనాలు, 7 ఆర్‌బీకేలు, 5 హెల్త్ క్లీనిక్‌లు మంజూరు కాగా వాటిలో 13 సచివాలయ, 5 ఆర్‌బీకే, 4 హెల్త్ క్లీనిక్ భవనాల నిర్మాణం పూర్తయ్యాయన్నారు. అలాగే మండలంలో రూ.2.60 కోట్లతో సుమారు 4 కి.మీ మేర సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టామన్నారు. పశు వైద్యుడు సాయిబాబా మాట్లాడుతూ మండలంలో సుమారు 10,500 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశామన్నారు. హార్టికల్చర్ అధికారి నరేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగుకు ఇక్కడి భూములు అనుకూలంగా ఉన్నాయని నివేదికలు తేల్చాయని రైతులకు అవగాహన కల్పించి పంట సాగుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు